# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ డీఎస్సీ నిర్వహణపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు.

❖ అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శం కావాలని కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ సూచించారు.

❖ భారత పారిశ్రామిక వాడల్లో తక్కువ కర్బన ఉద్గారాలు విడుదలయ్యే అల్యూమినియం పరిశ్రమని ఏర్పాటు చేయాలని రష్యా సంస్థను మంత్రి నారా లోకేశ్ కోరారు.

❖ భారత్ నెట్ ఉద్యమి పథకం కింద గుంటూరు జిల్లాలో "సమృద్ధి కేంద్రం" భవనాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈరోజు ప్రారంభించారు.

===================

డీఎస్సీ నిర్వహణపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శిక్షణ పొందుతున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో ముఖ్యమంత్రి మాట్లాడారు. కార్యకర్తలను నాయకులుగా మలిచేందుకే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర శ్రేయస్సు, పార్టీ క్రమశిక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, తప్పులు చేసిన వారిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేయాలని, నాయకులుగా ఎదగాలనే సంకల్పం తీసుకోవాలని సూచించారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లా పెదపెంకి గ్రామంలో అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. పెదపెంకి గ్రామంలో వందకు పైగా ఫైలేరియా కేసులు నమోదవటం, తరచూ ప్రజలు ప్రమాదకర జ్వరాల భారిన పడుతుండటంతో ఉపముఖ్యమంత్రి అక్కడి సమస్యలపై దృష్టి పెట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవటమే అన్ని సమస్యలకు మూలమని అధికారులు గుర్తించారు. గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు అధికారులు

వివరించారు. ఈనెల 24న పెదపెంకి గ్రామానికి వచ్చి మ్యాజిక్ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తానని పవన్ కళ్యాణ్ తెలిపారు.

===================

రష్యా పర్యటనలో భాగంగా అతిపెద్ద అల్యూమినియం సంస్థల్లో ఒకటైన రుసాల్ (RUSAL) సీనియర్ మేనేజ్‌మెంట్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్.. సెయింట్ పీటర్స్ బర్గ్ లో సమావేశమయ్యారు. భారత పారిశ్రామిక కారిడార్లలో లో-కార్బన్ గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్, ఎక్స్ ట్రూషన్ యూనిట్ నిర్మించాలని ఆయన కోరారు. అలాగే, భారతదేశంలోని డీప్ వాటర్ పోర్టుల వద్ద ప్రత్యేకమైన వాటర్ ఫ్రంట్ బెర్త్‌లు, క్రమబద్ధమైన కస్టమ్స్ క్లియరెన్స్‌లను వినియోగించి కోస్టల్ అల్యూమినియం రిఫైనరీ, బాక్సైట్ దిగుమతి హబ్ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం–చెన్నై కారిడార్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్‌లకు అనుసంధానం చేస్తూ... హై-వాల్యూ ఆటోమోటివ్, ఏరోస్పేస్ అల్లాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

===================

రాయలసీమను దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీ జీ భరత్ తెలిపారు. కడపలో ఈరోజు జరిగిన `రైజింగ్ రాయలసీమ` సదస్సులో ఆయన మాట్లాడుతూ... సహజ వనరులు, భౌగోళిక అనుకూలత, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో రాయలసీమకు అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాయలసీమను హరిత ఇంధన కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

===================

జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ నామినేషన్ ఈరోజు దాఖలు చేశారు. అసెంబ్లీ భవనంలో లింగమనేని రమేష్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి అందచేశారు. రమేశ్ నామినేషన్‌ను 10 మంది కూటమి ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు.

విరామం

===================

2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. `భారత్ నెట్ ఉద్యమి` కేంద్ర పథకం కింద సమృద్ధి గ్రామ ప్రాజెక్ట్ అమలులో భాగంగా గుంటూరు జిల్లా, నారాకోడూరు గ్రామంలో "సమృద్ధి కేంద్రం" భవనాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటైన ఈ కేంద్రం ద్వారా గ్రామ ప్రజలకు పలు ప్రభుత్వ, వైద్య, డిజిటల్ సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు 'కేంద్రం ఒక్కటి... సేవలు అనేకం' అనే నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పని చేస్తున్నారని కేంద్రమంత్రి తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

===================

అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శం కావాలని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ సూచించారు. మార్కాపురం జిల్లా కనిగిరిలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

చూపిన మార్గంలో పయనించి ఎందరో నాయకులుగా ఎదిగారని.. వారిలో తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ కూడా ఒకరని అన్నారు. ఏ దళితుడికీ అన్యాయం జరగకుండా ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

===================

ఎం.ఎస్.ఎం.ఈ. యూనిట్ల స్థాపనకు సుమారు 500 కోట్ల రూపాయల ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి కుటుంబం ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. స్వర్ణాంధ్ర-2047 సాధనకు అందరూ భాగస్వాములు కావాలని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

===================

రైతుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం సారిక పంచాయతీ పరిధిలోని మునక్కాయవలస గ్రామంలో ఈరోజు నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రైతులకు భూ హక్కుల భద్రత కల్పించడంలో పట్టాదారు పాస్ పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు.

===================

అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన `యోగ మాసం` కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లాలో అమలు చేయడానికి అన్ని చర్యలు చేపట్టామని జిల్లా సంయుక్త కలెక్టర్ అహ్మద్ ఖాన్ చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేపటి నుండి ఈనెల 21వ తేదీ వరకు జిల్లాలో ఉన్న సచివాలయాల  పరిధిలో.. మండల స్థాయిలో.. జిల్లా స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు అంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

===================

రాబోయే 2, 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు.

===================
===================